‘కొలనుపాక’లో చండికాంబ గుడి మెట్టు శాసనం

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో ఇటీవల కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ పర్యటించింది. ఈ సందర్భంగా సోమేశ్వరాలయ ఆవరణలోని చండికాంబగుడి లోపలి మెట్టు వద్ద కాకతీయుల కాలంనాటి శాసనాన్ని గుర్తించారు. ఈ శాసనం 13వ శతాబ్దపు తెలుగులిపిలో ఉన్నదని పేర్కొన్నారు. ఇందులో వరంగల్ కాకతీయ మహారాజు గణపతిదేవుడు అనుమకొండ పురవేశ్వరుడిగా పేర్కొన్నారు. గుడిమెట్టును తొలగించి ఈ శాసనాన్ని కొలనుపాక మ్యూజియంలో భద్రపరచాలని పురావస్తు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

‘మహా’ నుంచి రాష్ట్రానికి తొలి వందేభారత్ రైలు

రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): నాగ్‌పూర్ రైల్వే స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు వందే భారత్ రైలును ప్రధాని మోదీ రేపు (16న) వర్చువల్‌గా నాగ్‌పూర్‌లో ప్రారంభించనున్నట్టు అధికారులు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు సోమవారం సాయంత్రం 4.15కు నాగ్‌పూర్ నుంచి బయలుదేరి రాత్రి 11.25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు.

‘వ్యవసాయం’లో రాష్ట్రానికి అత్యుత్తమ పురస్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి సక్రమ వినియోగంలో రాష్ట్రానికి దేశంలోనే అత్యుత్తమ అవార్డు లభించింది. ఢిల్లీలో శనివారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర అధికారులకు అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్రానికి రూ. 2,836 కోట్ల ప్రయోజనం కలిగిందని, 2,199 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లను నెలకొల్పినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు వెల్లడించారు. యూనిట్లలో 1322 వ్యవసాయ ప్రాథమిక ప్రాసెసింగ్, 785 గిడ్డంగులు, 163 కస్టమ్ హైరింగ్ సెంటర్లు,101 పోస్ట్-హార్వెస్ట్ తదితర సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలోని బ్యాంకులు అత్యుత్తమ పనితీరు కనబర్చినట్టు గుర్తించారు.

ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల రాస్తారోకో

రీజినల్ రింగ్ రోడ్డులో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 65వ జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. అంతకుముందు స్థానిక శుభం గార్డెన్‌లో ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- చౌటుప్పల్

ఒంటరి వ్యక్తులకు రుణమాఫీ అయ్యేదెట్లా?

రేషన్‌కార్డు, కుటుంబ యూనిట్ లేకపోవడంతో సమస్య

- **ఒంటరి వ్యక్తులకు సంబంధించి కనిపించని ఆప్షన్**
- **తమకు ఆప్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): చక్రధర్ అనే రైతు ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆయనకు ఓ అన్న ఉండగా పెళ్లి కావడంతో వేరుగా ఉంటున్నాడు. చక్రధర్ పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా జీవిస్తున్నారు. ఆయనకు రూ.1.57లక్షల పంట రుణం ఉంది. ప్రభుత్వం చేసిన రుణమాఫీలో ఆయనకున్న రుణం మాఫీ కాలేదు. ఇప్పుడు వెళితే కుటుంబసభ్యులెవరైనా ఉంటేనే కుటుంబ నిర్ధారణ చేస్తామని, ఒంటరి వాళ్లకు చేసేందుకు ఆప్షన్ లేదని ఏఈవో చెబుతున్నారు.

దీంతో ఏం చేయాలో అర్థంకాక తనకు ఇక రుణమాఫీ కాదనే ఆందోళనను రైతు చక్రధర్ వ్యక్తం చేస్తున్నాడు. ఈ విధంగా రాష్ట్రంలో చాలామంది ఒంటరి మహిళలు, పురుషులు రుణమాఫీ కాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ఒంటరి వ్యక్తులను, ఇతర దేశాల్లో బతుకుదెరువు కోసం వెళ్లిన వారిని రుణమాఫీకి దూరం చేస్తున్నది. రుణమాఫీకి సంబంధించి కుటుంబ నిర్ధారణలో భాగంగా వీరిని గుర్తించే ఆప్షన్ ఇవ్వలేదు. భార్యనో, భర్తనో, తల్లిదండ్రులో, అన్నదమ్ముల్లో ఎవరో ఒకరు ఉంటేనే కుటుంబ నిర్ధారణ చేస్తున్నారు. ఎవరూ లేని వారిని పరిగణలోకి తీసుకోవడం లేదు. ఒకవేళ వీళ్ల పేర్లు నమోదు చేయాలంటే కుటుంబ సభ్యులను చూపించాలని కొర్రీలు పెడుతున్నారు. దీంతో భర్త చనిపోయిన వాళ్లు, విడాకులు తీసుకున్నవాళ్లు, పెళ్లి చేసుకోనివాళ్లు, తల్లిదండ్రులు లేని వాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు బతుకుదెరువు కోసం విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కుటుంబ నిర్ధారణ సమయంలో వాళ్లు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వాళ్లను విస్మరిస్తున్నట్టుగా తెలిసింది. ప్రస్తుతం వాళ్లు ఇక్కడ లేరు కాబట్టి వాళ్ల పేర్లు నమోదు చేయడం లేదని తెలిసింది. రుణమాఫీ ప్రక్రియలో ప్రభుత్వం ఒంటరిగా జీవిస్తున్న వారిని అర్హులుగా గుర్తించేందుకు అవసరమైన విధానమే లేకపోవడం గమనార్హం. ఏఈవోలు రైతుల ఇళ్లకు వెళ్లి కుటుంబ పెద్ద నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నారు. ఎవరూ లేని వాళ్లకు సంబంధించి పేర్లు నమోదు చేసేందుకు, వాళ్లు రుణమాఫీకి అర్హులు కాదా అనేది తేల్చేందుకు ప్రభుత్వం ఏ విధానాన్ని ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో ఒంటరి వాళ్లు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి రుణమాఫీలో తమ పేర్ల నమోదుకు ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కులగణనపై మోసగిస్తే కాంగ్రెస్‌కు శిక్ష తప్పదు

- **రేవంత్‌రెడ్డి సర్కార్‌పై బీసీ నేత ఆర్ కృష్ణయ్య ధ్వజం**
- **కులగణన తర్వాతే ఎన్నికలు జరపాలని డిమాండ్**

రవీంద్రభారతి: తక్షణమే కులగణన షెడ్యూల్ విధివిధానాలను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే కాంగ్రెస్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

బషీర్‌బాగ్‌లో అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనపై హైకోర్టు మూడు నెలల గడువు విధించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించడం లేదని ధ్వజమెత్తారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కులగణనను విస్మరించడం సహించరానిదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై 16 నుంచి 19 వరకు అన్ని జిల్లాలో అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ హనుమంతరావు, గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, గౌరిగె మల్లేశ్, అంజీ, భూపేశ్ సాగర్, లక్షణ్‌యాదవ్ పాల్గొన్నారు.

త్వరలో కులగణనకు కార్యాచరణ

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): త్వరలోనే కులగణన కార్యాచరణ చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. శనివారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పంచాయతీరాజ్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, డీఎస్ కమిషనర్ అనితా రామచంద్రన్, డిప్యూటీ కమిషనర్ సుధాకర్ ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. విధివిధానాలపై చర్చించారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి, కార్యదర్శి మాయాదేవి పాల్గొన్నారు.

హమ్మయ్యా.. బదిలీ అయ్యాం

- **11 ఏండ్ల తర్వాత మాడల్ టీచర్లకు మోక్షం**
- **2,757 మందిని బదిలీ చేసిన విద్యాశాఖ**
- **హర్షం వ్యక్తంచేసిన ఉపాధ్యాయ సంఘాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా.. పనిచేసేదేమో సూర్యాపేట. ఇదే సూర్యాపేట జిల్లాకు చెందిన మరో టీచర్‌కు సిద్దిపేట జిల్లాలో పోస్టింగ్. సిద్దిపేట జిల్లాకు చెందిన మరో టీచర్‌కు ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో పోస్టింగ్. ఇలా తమ స్వస్థలాలకు 150-200 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్న మాడల్ స్కూల్ టీచర్లకు మోక్షం కలిగింది. పాఠశాల విద్యాశాఖ శనివారం 2,757 మంది మాడల్ స్కూల్ టీచర్లకు స్థానచలనం కల్పించింది. పదకొండేండ్ల నరకయాతన నుంచి విముక్తి కల్పించింది. ఉపాధ్యాయ సంఘాలు, టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

గత కాంగ్రెస్ సర్కారు నిర్వాకం..

194 మాడల్ స్కూళ్లల్లో 5,500 మంది రెగ్యులర్ టీచర్లు పనిచేస్తున్నారు. 2011లో నోటిఫికేషన్ ఇచ్చినా.. 2013-14వరకు దశలవారీగా టీచర్లను రిక్రూట్‌చేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు హయాంలో రోస్టర్ కమ్ మెరిట్ పాటించలేదు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు ఒక్కో స్కూల్‌కు 2 పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఒక పోస్టునే నింపారు. ఒకే స్కూల్‌లో రెండు పోస్టులకు ఎంపికైన వారిని పోస్టుల్లేవని దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. దీంతో చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్టుగా పరిస్థితి మారింది.

కష్టాలను దూరం చేసిన కేసీఆర్

మాడల్ స్కూల్ టీచర్ల కష్టాలను గత కేసీఆర్ సర్కారు దూరం చేసింది. వీరికి రాష్ట్ర విభజనకు ముందే ఉద్యోగాలిచ్చినా గత కాంగ్రెస్ సర్కారు సర్వీస్ రూల్స్‌ను రూపొందించలేదు.

బదిలీ అయినవారు	
పోస్టు	బదిలీ అయినవారి సంఖ్య
ప్రిన్సిపాళ్లు	89
పీజీటీలు	1,923
టీజీటీలు	745
మొత్తం	2,757

2019లో కేసీఆర్ సర్కారు సర్వీస్ రూల్స్‌ను రూపొందించి, ప్రభుత్వ ఉద్యోగుల్లా సెలవులు వాడుకునేందుకు లీవురూల్స్‌ను అమలు చేసింది. డీఏ, పీఆర్సీని అమలుచేసింది. జీవో -317 అమలుచేసేందుకు సంకల్పించింది. దీనిపై కోర్టుకెళ్లడంతో పాత జోన్ల ప్రకారం బదిలీలు చేపట్టాలని నిర్ణయించింది. గతేడాది జూలైలో బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేసింది. పలువురు టీచర్లు సీనియార్టీ, సర్వీస్ పాయింట్ల మీద కోర్టుకెళ్లడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 12న బదిలీలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. దీంతో శనివారం తెల్లవారుజామున టీచర్లను ప్రభుత్వం బదిలీచేసింది.

వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం బాధ్యతలు

ఉత్తర్వులు వచ్చిన 25 రోజులకు

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ శాఖ సలహాదారుగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పబ్లిక్ గార్డెన్స్‌లోని ఉద్యానశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. పోచారం నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడిన 25 రోజులకు బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఆయనను వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమిస్తూ ఆగస్టు 20న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

బేసిక్ పేలో ‘వరద కోత’ వద్దు

- **బాధితులకు తోచినంత సాయం చేస్తామన్న కార్మికులు**
- **సింగరేణి నిర్ణయంపై కార్మిక వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత**

పెద్దపల్లి, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు సింగరేణి సంస్థ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఒక రోజు బేసిక్ పే ఇవ్వాలన్న యాజమాన్యం నిర్ణయాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ మెప్పు పొందడం కోసం తమను ముంచడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల వర్షాలు బీభత్సం సృష్టించడంతో ఎంతో మంది నిరాశ్రయులు కాగా.. వారికి అండగా నిలవాలని సింగరేణి సంస్థ భావించింది. సంస్థ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఒక రోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు ఒక రోజు బేసిక్ శాలరీ రికవరీకి సమ్మతించాలని ఈ నెల 11న గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీకి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీకి, సీఎంవోఏఐకి యాజమాన్యం లేఖ రాయగా కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ‘వరద బాధితులపై మాకు సానుభూతి ఉన్నా.. ఇలా ఒక రోజు బేసిక్ పే కట్ చేసేందుకు మాత్రం ఒప్పుకోం. సింగరేణి ఉద్యోగులు, కార్మికుల్లో అందరూ ధనవంతులు కాదు. మా కష్టాలు మాకు ఉన్నాయి. మేం తోచినంత సాయం చేస్తాం’ అని స్పష్టంచేస్తున్నారు. ఒక రోజు వేతనం కట్ చేయొద్దని, డొనేషన్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తే తమకు తోచినంత సాయం చేస్తామని పేర్కొంటూ ఈ నెల 13న పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 కార్మికులు 60 మంది సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఓసీపీ-2 కాలరీ మేనేజర్‌కు సమర్పించడం చర్చనీయాంశంగా మారింది. ఈ లేఖ సింగరేణి విస్తరించి ఉన్న 10 జిల్లాల్లోని కార్మికుల గ్రూపుల్లో హల్‌చల్ చేస్తుండగా.. వారి నిర్ణయానికి పెద్ద సంఖ్యలో కార్మికులు మద్దతు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.

వీకే ఓసీకి పర్యావరణ అనుమతులు

- **రెండు నెలల్లో బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలి**
- **ఏరియా జీఎంల సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం**

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): కొత్తగూడెంలోని వీకే ఓపెన్ కాస్ట్ గనికి తొలి దశ పర్యావరణ అనుమతులొచ్చాయని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం వెల్లడించారు. రానున్న రెండునెలల్లో బొగ్గు ఉత్పత్తికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుదుత్పత్తి కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గును సరఫరా చేయాలన్నారు. రోజుకు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, అదే పరిమాణంలో బొగ్గును రవాణా చేయాలని ఆదేశించారు. మూడు నెలల్లో కోల్పోయిన ఉత్పత్తి నష్టాలను భర్తీచేసేందుకు కృషిచేయాలని సూచించారు. వీసీలో డైరెక్టర్లు జీ వెంకటేశ్వర్‌రెడ్డి, డీ సత్యనారాయణరావు, జీఎం కో ఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం జక్కం రమేశ్ పాల్గొన్నారు.

సింగరేణిలో బదిలీలకు ప్రత్యేక పాలసీ

- **ఉద్యోగుల విజ్ఞప్తుల స్వీకరణకు యాప్**
- **పర్సనల్ విభాగం సమీక్షలో సీఎండీ బలరాం వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఉద్యోగులకు ప్రత్యేక ట్రాన్స్‌ఫర్ పాలసీని రూపొందిస్తామని, కాలరీస్‌లో కాగిత రహిత కార్యకలాపాలు నిర్వహించేలా రెండు నెలల్లో ఈ-ఆఫీస్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని సంస్థ సీఎండీ బలరాం తెలిపారు. పర్సనల్ విభాగం పనితీరుపై హైదరాబాద్ సింగరేణిభవన్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బలరాం మాట్లాడుతూ సింగరేణిలో అధికారుల బదిలీ విషయంలో ప్రత్యేక పాలసీ ఉన్నదని, కానీ 40 వేల మంది కార్మికులకు ఎలాంటి బదిలీ విధానం లేదన్నారు. పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక అప్లికేషన్(యాప్)ను రూపొందించాలని ఐటీ విభాగానికి ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర రెడ్డి, జీఎంలు ఎస్‌డీఎం సుభానీ, రవిప్రసాద్ పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5లక్షలు

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం : మంత్రి పొన్నం ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్14(నమస్తే తెలంగాణ): గతేడాది డిసెంబర్ 7 తర్వాత గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు, జూన్ 2, 2014 తర్వాత మరణించిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో హైదరాబాద్‌లో శనివారం సమావేశమయ్యారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఎన్నారై సెల్ అధ్యక్షుడు వినోద్ నేతృత్వంలోని కమిటీ నివేదించిన ఐదు అంశాలపై చర్చించారు.

మధ్యప్రదేశ్‌లో ‘అద్దెకు భార్య’

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని శివపురిలో మహిళల సంత జరుగుతుండటం అందరినీ కలచివేస్తున్నది. ధడీచా పేరుతో కొనసాగుతున్న ఈ తిరోగమన ఆచారం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఈ సంతలో యువతులు, మహిళలను అద్దెకు ఇస్తారు. నచ్చిన యువతి/మహిళను నెలలు, సంవత్సరాల కోసం అద్దెకు తీసుకుంటారు. ఆమె కుటుంబ సభ్యులు, అద్దెకు తీసుకునేవారు స్టాంపు పేపర్లపై ఒప్పందం రాసుకుంటారు. పెండ్లి చేసుకోవడానికి తగిన యువతి దొరకనివారు, తమ ఇండ్లలోని వయోవృద్ధుల సంరక్షణ కోసం మహిళలు అవసరమైనవారు ఈ విధంగా ఒప్పందాలు చేసుకుంటారు. అద్దె రూ.15,000 నుంచి ప్రారంభమై, కొన్ని లక్షల వరకు ఉండవచ్చు. కన్యలకు ఎక్కువ ధర ఉంటుందని, అయితే ఈ ఒప్పందాన్ని తిరస్కరించే హక్కు మహిళలకు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు.

వాణిజ్య

యమహా స్పోర్ట్స్‌బైక్

చెన్నై, సెప్టెంబర్ 14: స్పోర్ట్స్ బైకుల విభాగంలో పోటీని మరింత పెంచే ఉద్దేశంలో భాగంగా యమహా మోటర్ సరికొత్త బైకును అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్బన్ ఫైబర్ ప్యాటర్న్ గ్రాఫిక్‌తో రూపొందించిన ఆర్15ఎం బైకును మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 155 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ధర రూ.2,08,300గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. అలాగే దీంతోపాటు ఆర్15 ఎం మెటాలిక్ గ్రే కలర్ మాడల్ ధర రూ.1,98,300.

గోల్డ్ @75వేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 14: బంగారం ధరలు మరింత ప్రియమయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం ధర రూ.440 అధికమై రూ.74,890కి చేరుకున్నది. అంతకు ముందు ఇది రూ.74,450గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.400 ఎగబాకి రూ.68,250 నుంచి రూ.68,650కి చేరుకున్నది. వెండి లక్ష రూపాయల దిశగా పయనిస్తున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2,000 అధికమై రూ.97 వేలకు చేరుకున్నది. గడిచిన నాలుగు రోజుల్లో బంగారం రూ.2,500 వరకు, వెండి రూ.8 వేల వరకు పెరిగింది.

రోజుకు రూ.3తో రిస్క్ కవరేజీ

సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రొడక్ట్స్ తెస్తున్న బీమా సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: సైబర్ మోసాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. పెరుగుతున్న టెక్నాలజీనే ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు దాడులకు తెగబడుతున్నారు. దీంతో బాధితులకు రక్షణే లేకుండాపోతున్నది. అందుకే ఇన్సూరెన్స్ కంపెనీలు ఇప్పుడు ఈ కోణంలో దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా బీమా సంస్థలు.. సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రొడక్ట్స్‌ను పరిచయం చేస్తున్నాయి. ఈ రిస్క్ కవరేజీలు కేవలం రోజుకు రూ.3కే లభిస్తుండటం విశేషం. వ్యక్తులు, వ్యాపార సంస్థల అవసరాలకు తగ్గట్టుగా ఈ చిన్న ప్లాన్లను ఇన్సూరర్లు రూపొందిస్తున్నారు.

ఏఐ వినియోగంతో..

మోసగాళ్ల చేతికి సాంకేతిక పరిజ్ఞానం చిక్కితే జరిగే నష్టం అపారం. ఇప్పుడు సైబర్ ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ)తో మోసగాళ్లు చేస్తున్నదిదే. జెన్‌ఏఐ సాయంతో నకిలీ వీడియోలు, వాయిస్ క్లోనింగ్‌లు, టెక్స్ట్ సందేశాలు, ఎస్ఎంఎస్ ఫిషింగ్, ఫ్రాడ్ కాల్స్, ఫేస్ మార్ఫింగ్, ఓటీపీ చోరీలకు దిగుతున్నారు. వీటితో వ్యక్తులు, సంస్థలను బెదిరిస్తూ అక్రమాలకు తెగబడుతున్నారని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ పార్థనీల్ ఘోష్ అన్నారు. ఈ సంస్థ ఇప్పటికే మాల్‌వేర్, రాన్సమ్‌వేర్ సైబర్ దాడులను ఎదుర్కొనేలా వ్యక్తులు, వ్యాపార సంస్థల కోసం ఓ సైబర్ సాషే ఇన్సూరెన్స్ పాలసీని తీసుకొచ్చింది.

పెరుగుతున్న మార్కెట్ విలువ

భారతీయ సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ 2023లో 50-60 మిలియన్ డాలర్లుగా ఉన్నది. అయితే ఇది రాబోయే ఐదేండ్లలో 27-30 శాతం వృద్ధి చెందవచ్చని డెలాయిట్ ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో అంచనా వేసింది. ఇందుకు తగ్గట్టుగానే ఎస్బీఐ జనరల్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, ఐసీఐసీఐ లాంబార్డ్‌లు సైబర్ రిస్క్ కవరేజీ ప్లాన్లను తీసుకొస్తున్నాయి. కాగా, జెన్‌ఏఐ దన్నుతో జరుగుతున్న మోసాల వల్ల ఆర్థికపరమైన నష్టమేగాక సంస్థల పరపతి, వ్యక్తుల పరువు-ప్రతిష్ఠలూ దెబ్బతింటున్నాయని ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ లాక్టోన్ ఇండియా సీఈవో సందీప్ దాడియా అన్నారు. బలమైన లీగల్ ప్రొటెక్షన్ కోసం ఓ డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్నీ తేవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచార చోరీకి కంపెనీలదే బాధ్యతన్నారు.

జాగ్రత్తలు అవసరం

పెరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో అంతా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీతో నకిలీ మాయాజాలం నడుస్తున్నదని, అన్ని రకాలుగా నష్టపరుస్తున్నారంటున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు చాలాచాలా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అనవసరపు లింక్స్‌పై క్లిక్ చేయవద్దని, అపరిచితుల కాల్స్, మెసేజ్‌లకు స్పందించకపోవడమే ఉత్తమమంటున్నారు. వ్యక్తిగత ఫోటోలను సైతం తరచూ ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయవద్దని, కొత్తకొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. విలువైన సమాచారాన్ని (బ్యాంక్ ఖాతా నెంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు) స్మార్ట్‌ఫోన్లలో సేవ్ చేసుకోవడం, ఈ-మెయిల్స్‌లో పంపించుకోవడం మానేయడం మంచిదనీ సైబర్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

ఏమిటీ సాషే ఇన్సూరెన్స్

సాషే ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంటే చిన్న పరిమాణంలో ఉండే బీమా పాలసీలు. సాధారణంగా ఇవి ప్రయాణం, దొంగతనం, గృహోపకరణాలు, ఫిట్నెస్ వంటి కొన్ని అంశాలకు సంబంధించి రూపొందుతాయి. ఇంకా చెప్పాలంటే పరిమిత శ్రేణిలో, తాత్కాలిక రక్షణే లక్ష్యంగా ఈ బీమా పాలసీలుంటాయి. సంప్రదాయ ఇన్సూరెన్స్ పాలసీలైతే జీవిత, ఆరోగ్య, ఆస్తుల వంటి అంశాలపై సమగ్ర రీతిలో లభిస్తాయి.

ఏయే కవరేజీలు?

ఐడెంటిటీ చోరీ, సైబర్ స్టాకింగ్, ఫిషింగ్, ఈ-మెయిల్ స్పూఫింగ్, సైబర్ దోపిడి, నిధుల దొంగతనం, డాటా అపహరణ వంటి వాటికి ఈ బీమా రక్షణ కల్పిస్తుంది. న్యాయపరమైన వ్యవహారాల్లో ఖర్చులను బీమా సంస్థలే ఇస్తాయి.

బజాజ్ హౌజింగ్ ఐపీవో అదుర్స్

- **63 రెట్ల అధిక బిడ్డింగ్ దాఖలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థ బజాజ్ హౌజింగ్ ఫైనాన్స్ అదరగొట్టింది. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమైన సంస్థకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 63 రెట్ల అధిక బిడ్లు దాఖలయ్యాయి. అంటే ఐపీవోల చరిత్రలో ఇంతటి స్థాయిలో బిడ్లు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. వాటాల విక్రయం ద్వారా రూ.6,560 కోట్ల నిధులను సేకరించాలనుకున్న సంస్థకు రూ.3.2 లక్షల కోట్ల బిడ్లు దాఖలయ్యాయి. అంటే జారీ చేసినదానికంటే 63.6 రెట్లు అధికంగా బిడ్లు దాఖలు కావడం విశేషం. మార్కెట్లో సెంటిమెంట్ బలంగా ఉండటం, ముఖ్యంగా రిటైల్ పెట్టుబడిదారులు అధికంగా బిడ్లు దాఖలు చేశారు. దేశ జీడీపీలో ఈ ఐపీవో వాటా ఒక్క శాతానికి పైగా ఉన్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను దేశ జీడీపీ రూ.295.36 లక్షల కోట్లుగా ఉన్నది.

- బజాజ్ హౌజింగ్ ఫైనాన్స్ ఈ నెల 16న ఉదయం 10 గంటలకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్‌కాబోతున్నది.
- 2008లో కోల్ ఇండియా జారీ చేసిన షేర్లకు రూ.2.36 లక్షల కోట్ల బిడ్లు దాఖలయ్యాయి.
- అలాగే ప్రీమియర్ ఎనర్జీ షేర్లకు రూ.1.48 లక్షల కోట్లు బిడ్లు రాగా, టాటా టెక్నాలజీ ఐపీవోకి రూ.1.56 లక్షల కోట్ల బిడ్లు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవే గరిష్ఠ స్థాయి బిడ్డింగులు.

2 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: జీఎస్టీ ఎగవేతలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.2.01 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలకు పాల్పడినట్టు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) గుర్తించింది. 2024-25లో 6,084 కేసులు జీఎస్టీ ఎగవేతలకు పాల్పడినట్టు, వీటి విలువ రూ.2.01 లక్షల కోట్లని శనివారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. సేవల విభాగంలో ఆన్‌లైన్ గేమింగ్, బీఎఫ్ఎస్ఐ, ఇనుము, రాగి, తుక్కు వంటి విభాగాల్లో జీఎస్టీ ఎగవేతలు అధికంగా ఉంటాయని పేర్కొంది. 2022-23లో నమోదైన 4,872 కేసుల జీఎస్టీ ఎగవేత రూ.1.01 లక్షల కోట్ల కంటే ఇది రెండింతలు పెరిగింది. జీఎస్టీ ఎగవేతల్లో పన్నుకు సంబంధించినవి 46 శాతంగా ఉండగా, 20 శాతం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, 19 శాతం ఐటీసీకి సంబంధించినవని పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో రూ.81 వేల కోట్ల ఎగవేతలు జరిగాయని తెలిపింది.